# అభివృద్ధి, సంక్షేమాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి

- జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వెంకటేశ్
- మండలాల్లో జోరుగా సాగుతున్న ప్రచారం
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు



రావిచేడ్‌లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మద్దతుగా బీఆర్‌ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ

కడ్తాల్, అక్టోబర్ 31 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ని గెలిపిస్తాయని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం బాలాజీనగర్ గ్రామ పంచాయతీలోని రేకుల కుంట తండాకి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలు జెడ్పీటీసీ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ జెడ్పీటీసీ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో గిరిజన తండాలు అన్ని విధాలా అభివృద్ధి సాధించాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే బీఆర్‌ఎస్‌కి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కి గిరిజనులంతా రుణపడి ఉండాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలను గిరిజనులు నమ్మొద్దని జెడ్పీటీసీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ హరిచంద్‌నాయక్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు వీరయ్య, నాయకులు దేవ్‌సింగ్, కిషన్, పవన్, హన్మా, అమర్‌సింగ్, శ్రీను, హాజి, జైపాల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల, అక్టోబర్ 31 : మండలంలోని నల్లవారిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ గుప్తా సమక్షంలో చేరారు. వారికి ఉప్పల వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయి. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్ యాదవ్‌కు కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో తెలగమల్ల వంశీ, రుద్రాక్ష శ్రీను, కొమ్మగోని శ్రీను, యాదయ్యా, జగన్, శ్రీను, శివనందు, శ్రీకాంత్, మల్లేశ్, విజయ్, ప్రశాంత్‌లు పార్టీలో చేరారు.

## జైపాల్ యాదవ్‌ను గెలిపించుకుందాం

కడ్తాల్, అక్టోబర్ 31 : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, అసెంబ్లీ ఎన్నికల్లో జైపాల్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని రావిచేడ్ గ్రామంలో ఎంపీటీసీ గోపాల్, ఉప సర్పంచ్ వెంకటేశ్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ర్యాలీని నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యమని చెప్పారు. జైపాల్‌యాదవ్ కృషితోనే నియోజకవర్గంలోని గ్రామాలు, తండాలు అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేశారన్నారు. గ్యారెంటీ, వారెంటీ లేని హామీలతో కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరుగుతున్నారని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే చిమ్మ చీకట్లేనని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రకటించిన మోస పూరిత హామీలను ప్రజలు నమ్మితే గోస తప్పదన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వాదించి, జైపాల్‌యాదవ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల, గ్రామాధ్యక్షులు వీరయ్యా, బాలకృష్ణ, సర్పంచులు లక్ష్మీనర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు పవన్, మల్లేశ్, రవి, మానస, గిరి, నాయకులు రంగయ్యా, సుదర్శన్‌రెడ్డి, లక్పతి నాయక్, లక్ష్మీకస్ననాయక్, వసంత, జమీర్, లింగం, భిక్షపతి, జితేందర్‌రెడ్డి, రాజు, శ్రీశైలం, యాదగిరి, బీరప్ప, రవికుమార్, చంద్రమౌళి, రాఘవులు, యాదయ్యా, రమేశ్, నర్సింహ, శివలింగం, ఇర్షాద్, సాయికుమార్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ అంటేనే అభివృద్ధి

ఆమనగల్లు, అక్టోబర్ 31 : బీఆర్‌ఎస్ పార్టీ అంటేనే అభివృద్ధికి చిరునామా అని జెడ్పీటీసీ నేనావత్ అనురాధ, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్ అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు మద్దతుగా కోనాపూర్ గ్రామంలో జెడ్పీటీసీ ఆధ్వర్యంలో, మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో మైనార్టీ విభాగం అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో, 7వ వార్డులో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో తెలియజేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల , పట్టణ అధ్యక్షులు అర్జున్‌రావు, పత్యానాయక్, ఎంపీటీసీలు దోనాదుల కుమార్, సరిత, కార్యనిర్వాహక అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తల్లోజు రామకృష్ణ, జంతుక అల్లాజీ, వస్పుల సాయిలు, కమఠం వెంకటయ్యా, జహంగీర్, తోట కృష్ణ, చలిచీమల సతీష్, కొమ్ము ప్రసాద్, జంతుక కిరణ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాటలను నమ్మొద్దు : ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



అన్నెబోయిన్‌పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మాడ్గుల : కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మొద్దు అని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని అన్నెబోయిన్‌పల్లి, సుద్దపల్లి గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి సాగు నీరు అందిస్తామన్నారు. బీఆర్‌ఎస్ వచ్చే ఎన్నికల్లో సెంచరీ కొట్టడం ఖాయమన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ కింద తండాలలో బీటీ రోడ్ల కోసం 100 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ధి కోసమే ఆరాట పడుతున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలోని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి, సర్పంచ్ యాదయ్యా, ఎంపీటీసీ చంటి, ఉప సర్పంచ్‌లు శేఖర్‌గౌడ్, సంజీవరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, యాదిరెడ్డి, లాలయ్యగౌడ్, జంగయ్య యాదవ్, జార్జిరెడ్డి, భూపతిరెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ దశరథనాయక్



కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఉప్పల వెంకటేశ్




ఆమనగలులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## పెండ్లి ముచ్చట తీరకముందే నిండు నూరేళ్లు

### రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్, విద్యార్థి దుర్మరణం

బొంరాస్‌పేట, అక్టోబర్ 31 : దేశ సేవ కోసం ఆర్మీ లో చేరిన ఓ యువకుడు తల్లిదండ్రుల కోరిక మేరకు పెండ్లి చేసుకోవాలనుకున్నాడు. విధులకు సెలవు పెట్టి నిశ్చితార్థం కోసం స్వగ్రామానికి వచ్చా డు. ఆదివారం తనకు కాబోయే జీవిత భాగస్వామితో నిశ్చితార్థం చేసుకుని సంతోషంగా ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని పెండ్లి ముచ్చట తీరకముందే తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ 163వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆర్మీ జవాన్ విషాదగాథ ఇది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. బషీరాబాద్ మండలం ఇస్మాయిల్‌పూర్‌కు చెందిన హోబ్యానాయక్, లక్ష్మీబాయికి ఇద్దరు కొడుకులు బలరాం(25), రతన్. ఇద్దరూ రెండేళ్ల కిందట ఆర్మీలో చేరారు. బలరాం మిజోరంలో పని చేస్తుండగా, రతన్ కోల్‌కతాలో పని చేస్తున్నాడు. ఇదేతండాకు చెందిన రాజునాయక్, నీలాబాయిల పెద్ద కొడుకు నవీన్(16) హైదరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బలరాంకు తల్లి దండ్రులు పెండ్లి చేయాలని నిర్ణయించి ఆదివారం నిశ్చితార్థం చేయాలని అనుకున్నారు. దీంతో బలరాం, రతన్ ఇద్దరూ సెలవు పెట్టి ఇస్మాయిల్‌పూర్‌కు వచ్చారు. ఆదివారం పూడూరు మండలం తిర్మలాపూర్‌లో అమ్మాయితో నిశ్చితార్థ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బలరాం, నవీన్(బలరాం బాబాయి కొడుకు) రాత్రి బైకుపై ఇంటికి బయలుదేరారు. రేగడి మైలారం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ కొడంగల్ ప్రభుత్వ దవాఖానాకు తరలించగా అప్పటికే మృతిచెందారని వైద్యులు తెలిపారు. యువకుల మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం దవాఖానాకు వచ్చి మృతదేహాలను చూసి బోరున విలపించారు. మృతుడు బలరాం తండ్రి హోబ్యానాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.



బలరాం (ఫైల్)



నవీన్ (ఫైల్)